బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బడే నాగజ్యోతి

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి నాగజ్యోతి

మంగపేట, సెప్టెంబర్ 27 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని చుంచుపల్లికి చెందిన పార్టీ కార్యకర్త బోడ శ్రీను, కమలాపురానికి చెందిన బందెల సాంబయ్య రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వారికి పార్టీ సభ్యత్వానికి చెందిన ప్రమాద బీమా రూ.2లక్షల చొప్పున మంజూరైన చెక్కులను మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నాగజ్యోతి బాధిత కుటుంబాలకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. అనంతరం అకినేపల్లిమల్లారానికి చెందిన పార్టీ కార్యకర్త పోలె రాజు ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకోగా పరామర్శించారు. నర్సింహసాగర్‌కు చెందిన పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కాడబోయిన నరేందర్ తల్లి ఐలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, తుమ్మ మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, దుర్గం రమణయ్య, జగదీశ్, మలికంటి శంకర్, రాజమల్ల సుకుమార్, మడి శోభన్, సీహెచ్ తిరుపతి, రూప భద్రయ్య, చందర్‌రావు, ఈసం రామ్మూర్తి, మదరి రామన్న, యలవర్తి శ్రీనివాస్, మంచాల నాగేందర్, పిల్లమర్రి వేణు, ద్రోణారావు, గొడుగు నరేశ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గుడివాడ శ్రీహరి, గంధం కిశోర్, నాగ అనిల్, రమేశ్, వేణు యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన రాజకీయవేత్త లక్ష్మణ్‌బాపూజీ

జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 27 : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నిబద్ధత కలిగిన రాజకీయ వేత్త అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించగా కలెక్టర రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే జీఎస్ఆర్ హాజరై చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని 1969లో మంత్రి పదవిని తృణపాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయ వేత్తని, ఆయన ఆశయాల కోసం కృషి చేయాలన్నారు. కలెక్టర్ మా ట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంలో ఆయన పాత్ర కీలకమని తెలిపారు. అలాగే భూపాలపల్లి జీఎం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సింగరేణి జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ హాజరై లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కళారూపాలు ప్రజల్లో చైతన్యం నింపాలి

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కళా ప్రదర్శనలు ఉండాలని ఎమ్మెల్యే జీఎస్ఆర్ అన్నారు. కలెక్టరేటల్‌లో ఆయన కలెక్టర్ రాహుల్‌శర్మతో కసి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో సమావేశం నిర్వహించారు. కళాకారులకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, మీ కళారూపాలు ప్రజల్లో చైతన్యం నింపాలని తెలిపారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తాం..

అర్హత కలిగిన దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తామని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు. జడ్పీ కార్యాలయం ఆవరణలో దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, అలిమ్ కో- కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన సహాయ ఉపకరణాల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే హాజరై దివ్యాంగుల రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల వారోత్సవాల గోడ పత్రికను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ పొందిన తరవాత రెండు నెలలో మరో క్యాంపు నిర్వహించి సహాయ ఉపకరణాలు, బ్యాటరీ సైకిళ్లు, స్కూటీలు అందించనున్నట్లు చెప్పారు. ఈ రోజు అందుబాటులో లేని దివ్యాంగులు శనివారం చిట్యాల మండల కేంద్రంలో జరిగే క్యాంపుకు హాజరుకావచ్చని సూచించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శైలజ, సంక్షేమ అధికారి చిన్నయ్య, సీడీపీవో అవంతి, డీపీఆర్వో శ్రీనివాస్, అన్నిశాఖల జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని 5, 6 వార్డులు కృష్ణకాలనీ, యాదవకాలనీల్లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో ఫేజ్ - 5 కింద రూ.55 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.

ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలి : కలెక్టర్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 27 : ప్రాధాన్యత రంగాలకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో ఆయన బ్యాంకర్లతో రుణాల మంజూరు, రెన్యూవల్స్ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు రుణాలు అందేలా చొరవ తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణం ఇవ్వాలని, రుణ లక్ష్యసాధనకు సమన్వయం అవసరమన్నారు. ప్రభుత్వ పథకాల అమల్లో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు ఇవ్వాలని, ఆయా బ్యాంకుల్లో పెండింగ్ యూనిట్ల రుణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.250 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం కాగా ఇప్పటి 1,480 సంఘాలకు రూ.131 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్బీఐ ఎల్డీవో అలీబాబా, నాబార్డ్ ఏజీఎం రవి, ఎల్డీఎం తిరుపతి, బ్యాంక్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే అటవీ, రెవెన్యూ భూ సమస్యలపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో నిర్వంచిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. కాటారం మండలం పోచంపల్లిలోని సర్వే నంబర్ 1లోని 660 ఎకరాల్లో భూ సమస్య ఉందని, పరిష్కరించడానికి కాటారం సబ్ కలెక్టర్, అటవీశాఖ అధికారులు సంయుక్త పరిశీలన చేయాలని సూచించారు. అలాగే జిల్లాలో ఉన్న రెవెన్యూ, అటవీ సమస్యలు పరిష్కారానికి గెజిట్ ప్రకారం పక్కా సర్వే నిర్వహించాలన్నారు. డీఎఫ్‌వో వసంత, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్లు, ఎఫ్ఆర్‌వోలు పాల్గొన్నారు. ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిపథ్ స్కీం ద్వారా అగ్నివీర్ వాయు కార్యక్రమంపై యువతకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లా నుంచి ఆర్మీ, నేవీ, ఏవియేషన్‌లో చేరి దేశానికి సేవ చేయాలన్నారు. 17 నుంచి 21 ఏండ్ల లోపు యువతను అగ్నిపథ్‌కు ఎంపిక చేస్తున్నారని, హైదరాబాద్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు క్లుప్తంగా యువతకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఉపాధి కల్పన అధికారి శ్యామల, అగ్నిపథ్ శిక్షకులు సందీప్ పాల్గొన్నారు.

అటవీ అధికారులపై దాడి హేయమైన చర్య

వెంటనే కేసు నమోదు చేయాలి

ఏటూరునాగారం/వెంకటాపురం(నూగూరు)/, సెప్టెంబర్ 27 : తాడ్వాయి మండలం దామెరవాయి అటవీ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని ఐటీడీఏ ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు, ఆదివాసీ వన నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహామూర్తి వేర్వేరుగా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏటూరునాగారంలో ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆలూరి వెంకటేశ్వర్లు, చింతకుంట మైనర్‌బాబు, ఉపాధ్యక్షుడు పెనక కృష్ణమూర్తి, కాక భాస్కర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా జేసీబీని స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించే క్రమంలో ఎఫ్ఎస్‌వో వినోద్, బీటు ఆఫీసర్ సోలం శరత్‌పై దాడికి పాల్పడడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గాయపడిన సోలం శరత్‌కు మెరుగైన వైద్య సేవలను అందించాలని అన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కంటెం లక్ష్మి, నారాయణ, కొమురం ప్రభాకర్, చేల నాగమణి, కాక సమ్మయ్య, తాటి నర్సింహులు, ఈక కిరణ్, సిద్ధబోయిన నిర్మల పాల్గొన్నారు. ములుగులో ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు మంకిడి రవి, రవికాంత్, నరేంద్ర, నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

రామప్ప ఆలయ ఆవరణలో విద్యార్థులతో అధికారులు

రామప్పలో ప్రపంచ పర్యాటక దినోత్సవం

వెంకటాపూర్, సెప్టెంబర్ 27 : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రామప్పలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, భద్రకాళి, రామప్ప దేవాలయం, సరస్సు తదితర పర్యాటక ప్రదేశాలను సందర్శింపజేశారు. అనంతరం రామప్ప దేవాలయ ఆవరణలో సాయంత్రం అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను టూరిజం, అండ్ పీస్ అనే థీమ్‌పై నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ములుగు ఎంపీడీవో రామకృష్ణ, రామప్ప, లక్నవరం హరిత మేనేజర్లు శివశంకర్, శ్రవణ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి : ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ, డాక్టర్ పీ శబరీష్

గోవిందరావుపేట, సెప్టెంబర్ 27 : పోలీస్‌స్టేషన్‌కు పలు సమస్యలపై వచ్చే ఫిర్యాదుదారులతో పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవా రం పస్రా పోలీస్ స్టేషన్‌ను ఓఎస్డీతో కలిసి సం దర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల నమోదు, వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పెండిం గ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదును స్వీకరించిన వెంటనే వారికి రసీదును అందించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించారు. దర్యాప్తును నిష్పక్షపాతంగా నిర్వహించాలని అన్నారు. డయల్ 100కాల్స్‌కు సత్వరమే స్పందించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఆయన వెంట ఓఎస్డీ మహేశ్‌బాబా సాహెబ్ గీతే, డీఎస్పీ రవీందర్, సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్, పీఎస్సైలు చంద్రశేఖర్, నరేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ జేఏసీ ధర్నా వాయిదా

ఏటూరునాగారం, సెప్టెంబర్ 27 : గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం (నేడు) ఐటీడీఏ ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నాను వాయిదా వేస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ గొప్ప సమ్మారావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసినఉపాధ్యాయుల సమస్యలపై ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ చర్చల్లో పీవో సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి నేపథ్యంలో ప్రస్తుతం ధర్నాను వాయిదా వేస్తున్నట్లు ఆయ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు గమనించాలని కోరారు. సంఘం నాయకులు సంతోశ్, రాజు, బానోతు శ్రీనువాస్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

మహదేవపూర్, సెప్టెంబర్ 27 : పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని బొమ్మాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై పవన్ కుమార్ , స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుప్పిరెడ్డి తిరుపతిరెడ్డి (45)తన భూమిలో రైతు మిర్చి సాగు చేస్తున్నాడు. పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన సోమనపల్లి ప్రభాకర్‌రెడ్డితో కొంత కాలంగా భూ వివాదం నడుస్తున్నది. తిరుపతిరెడ్డి తన భూమిలో మిర్చిపంట వేయగా దానిని ప్రభాకర్‌రెడ్డి ధ్వంసం చేశాడనే అనుమానంతో అతనితో గొడవపడ్డాడు. దీంతో అతడిని ప్రభాకర్‌రెడ్డి దూషిస్తూ బెదిరించాడు. దీంతో మనస్తాపానికి గురైన తిరుపతి రెడ్డి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో భూపాలపల్లి వంద పడకల దవాఖానకు తీసుకెళ్లారు. బాధితుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కేటీఆర్ సేన సోషల్ మీడియా అధ్యక్షుడిగా అనిల్

అనిల్‌కు నియామకపత్రం అందజేస్తున్న శ్రీకాంత్

చిట్యాల, సెప్టెంబర్ 27 : కేటీఆర్ సేన సోషల్ మీడియా మండల అధ్యక్షుడిగా గొర్రె అనిల్‌యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రశాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు నియోజకవర్గ అధ్యక్షుడు జన్నె శ్రీకాంత్ శుక్రవారం అనిల్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనిల్‌యాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్, జిల్లా అధ్యక్షుడు వీసం భరత్‌రెడ్డి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమోషన్లలో న్యాయం చేయాలి

మాట్లాడుతున్న సమ్మయ్య

ములుగురూరల్, సెప్టెంబర్ 27 : లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు కూడా కామన్ జాయినింగ్ తేదీని ఒకే తేదీగా పరిగణిస్తూ ప్రమోషన్‌లలో ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షు డు హట్కార్ సమ్మయ్య అన్నారు. శుక్రవారం ములుగులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెడ్ కౌన్సెలింగ్ ద్వారా ప్రమోషన్‌లు పొందిన జూనియర్ ఉపాధ్యాయుల కంటే లెఫ్ట్ ఓవర్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఉపాధ్యాయులు జూనియర్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రమోషన్‌ల విషయంలో తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యాయులు ఉప్పల స్వామి, రవీందర్, రఘురాం, సమ్ములు, రమేశ్, భద్రు, శ్రీనివాస్, గోపి, కేదారి పాల్గొన్నారు.

ప్రగళ్లపల్లిలో దోమల మందు స్ప్రే

వాజేడు, సెప్టెంబర్ 27 : డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రగళ్లపల్లి గ్రామంలో హెల్త్‌సూపర్‌వైజర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రెండో విడుత దోమల మందు పిచికారీ చేయడంతోపాటు ఇండ్లలో నీటి నిల్వలు గుర్తించి పారబోశారు. జ్వరాలు ఉన్న వారిని గుర్తించి రక్తపూతలు సేకరించి మందులు అందజేశారు. ఏఎన్ఎం కన్యాకుమారి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు ప్రసన్న, కన్నమ్మ, వినోద, అరుణ, ముత్తమ్మ, కాంత, లక్ష్మీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గీతిక కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, సెప్టెంబర్ 27 : మండల కేంద్రంలోని ఆకుల వారిఘనపూర్‌లో ఇటీవల జ్వరంతో మృతి చెందిన బాలిక కంకణాల గీతిక కుటుంబానికి వరంగల్‌లోని యువత నేతాజీ ఫౌండేషన్ తరపున రూ.15వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం బాలిక తల్లిదండ్రులకు అందించారు. మల్యాల పవన్, మున్నాల ద్వారా నేతాజీ ఫౌండేషన్ ప్రధాన సభ్యుడు గజ్జెల సుమన్, కొత్తకొండ అరుణ్‌కుమార్, అలవాల పృథ్వీలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్, తడక సుమన్, మున్నా, అజహరుద్దిన్ పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి.. రోడ్డుపై గుంతలు పూడ్చి

గుంతలు పూడుస్తున్న గ్రామస్తులు

కాటారం, సెప్టెంబర్ 27 : ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఆ గ్రామస్తు లు, యువకులు రోడ్డుపై గుంతలను పూడ్చి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ సమయంలో సిమెంట్ రోడ్డు తవ్వకాలు చేపట్టి పైప్‌లైన్ పూర్తయ్యాక కాంట్రాక్టర్ పూడ్చకుండానే వదిలేశాడు. అధికారులు పట్టించుకోకపోడంతో గ్రామస్తులు సొంత ఖర్చులతో కంకర, సిమెంట్ తీసుకవచ్చి పూడ్చివేశారు.

సింగరేణి కార్మికులకు సిల్వర్ మెడల్స్

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 27 : ఒడిశాలో జరుగుతున్న కోల్ ఇండియా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భూపాలపల్లికి చెందిన సింగరేణి కార్మికులు సిల్వర్‌మెడల్స్ సాధించారు. యాసీన్ మీర్జాబేగ్ (అండర్ మేనేజర్ కేటీకే-1 ఇంక్లైన్) 120 ప్లస్ కేజీల పవర్ లిఫ్టింగ్ కేటగిరిలో 395 కిలోలు బరువు ఎత్తి సిల్వర్ మెడల్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్‌లో 52 కేజీల కేటగిరీలో కే శ్రీలేఖ్య (బదిలీ వర్కర్ కేటీకే-5 ఇంక్లైన్) సిల్వర్ మెడల్, ఉమెన్ పవర్ లిఫ్టింగ్‌లో 47 కేజీల కేటగిరీలో బీ మమత (క్లర్క్) 145 కిలోల బరువు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించినట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ కే మారుతి తెలిపారు. సింగరేణి జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ సామిల్ సుధాకర్, భూపాల్‌పల్లి ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్, సింగరేణి టీం మేనేజర్ పి శ్రావణ్‌కుమార్, టీం కోచ్ హెచ్ రమేశ్, టీం అబ్జర్వర్ పర్స శ్రీనివాస్ క్రీడాకారులకు శుక్రవారం అభినందనలు తెలిపారు.

అక్రమ విద్యుత్ వాడకంపై తనిఖీ

మంగపేట, సెప్టెంబర్ 27 : మండలంలోని కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ మెయిన్ గేటు సమీపంలోని ఓ వ్యాపారి కమర్షియల్ కనెక్షన్ నుంచి ఫ్యాక్టరీలోని ఏడీఎం కార్యాలయానికి విద్యుత్ సరఫరా అవుతుందన్న సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్పీడీసీఎల్ ఏఈ ప్రశాంత్‌రెడ్డి బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేటు సమీపంలోని వ్యాపారికి ఇటీవల విద్యుత్ బిల్ ఎక్కువగా వస్తుండటాన్ని గమనించి తనిఖీలు జరుపగా, సదరు కనెక్షన్ ద్వారా ఫ్యాక్టరీలోపలి ఏడీఎం కార్యాలయానికి అప్పుడుప్పుడు విద్యుత్ సరఫరా అవుతున్న ఆనవాళ్లు అక్కడ కట్ చేసి ఉన్న సర్వీస్ వైరు ద్వారా గుర్తించామన్నారు. వెంటనే సదరు వ్యాపారి విద్యుత్ కనెక్షన్‌ను తాత్కాలికంగా నిలిపి వేసి, వివరణ ఇచ్చేందుకు తమ కార్యాలయానికి రావాల్సిందిగా తెలిపామన్నారు.

మరోసారి ఇలా కమర్షియల్ విద్యుత్‌ను పరిశ్రమలోకి ఇస్తే శాఖాపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఏఈ హెచ్చరించారు. అయితే ఏఈని తనిఖీలకు ఫ్యాక్టరీలోకి వెళ్లకుండా అక్కడి సెక్యూరిటీ కొద్ది సేపు అడ్డుకున్నట్లు తెలిసింది.

పస్రాలో విద్యుత్ మోటర్ల చోరీ

గోవిందరావుపేట, సెప్టెంబర్ 27 : మండలంలోని పస్రా గ్రామ సమీపంలోని గుండ్లవాగుకు ఇరువైపులా ఉన్న ఎనిమిది విద్యుత్ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రైతులు వాగు నుంచి పంట పొలాలకు నీరును వాడుకునేందుకు విద్యుత్ మోటర్లను అమర్చుకున్నారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎనిమిది మోటర్లను దొంగిలించినట్లు రైతులు తెలిపారు. వరి పైరు పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో విద్యుత్ మోటర్లు చోరీకి గురికావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు కుటుంబ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

రేగొండ, సెప్టెంబర్ 27 : రేషన్ కార్డులేని రైతులు ఆధార్, కుటుంబ ధ్రువీకరణ పత్రాలు మండల వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని వ్యవసాయ అధికారి పెద్ది వాసుదేవరెడ్డి అన్నారు. రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని రుణమాఫీ కాని రైతులు రేగొండ రైతు వేదికలో ధ్రువీకరణ పత్రాలు అందజేసి ఫొటోలు దిగాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు అందజేస్తేనే రుణమాఫీ అవుతుందన్నారు.

న్యాయం కోసం కలెక్టరేట్ ఎదుట దంపతుల నిరసన

నిరసన తెలుపుతున్న చీర్ల పోసిరెడ్డి లక్ష్మీ దంపతులు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 27 : తమకు న్యాయం చేయాలని మహదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామానికి చెందిన రైతు చీర్ల పోసిరెడ్డి, లక్ష్మి దంపతులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏండ్ల క్రితం సర్వే నెంబర్ 98లో కంకనాల రవీందర్‌రెడ్డి భూమిని కొన్నట్లు చెప్పారు. అప్పటి నుంచి సాగు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, కొన్ని రోజులుగా రవీందర్‌రెడ్డి భూమి తనదేనని, అడిషనల్ కలెక్టర్ అర్డర్ ఇచ్చాడని ఇబ్బందులకు గురిచేసున్నట్లు తెలిపారు. మహదేవపూర్ ఎస్సైని కలిసి న్యాయం చేయాలని కోరాగా ఆయనా రవీందర్‌రెడ్డికే అనుకూలంగా మాట్లాడుతునాడని ఆరోపించారు. ఆరు రోజులుగా కలెక్టర్‌ను కలుస్తూ న్యాయం చేయాలని కోరగా ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని, లేకపోతే కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

సొసైటీలోని రైతుల రుణాలు మాఫీ చేయాలి

గణపురం, సెప్టెంబర్ 27 : మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో రైతులందరి రుణాలు షరతులు లేకుండా మాఫీ చేయాలని మహాజన సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో చైర్మన్ కన్నెబోయిన కుమార్‌యాదవ్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. అర్ధవార్షిక జమా ఖర్చుల వివరాలు, గత పాలకవర్గ సమావేశాలపై చర్చించి, 2023-24 ఆడిట్ నివేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం కలిగి రుణాలు పొందిన రైతులందరికీ వన్ టైం సెటిల్మెంట్ చేయాలని తీర్మాణం ప్రవేశపెట్టగా చైర్మన్ మాట్లాడుతూ జనసభలో నిర్ణయించిన అంశాలను ఎమ్మెల్యే జీఎస్ఆర్, బ్యాంక్ మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ సిరిగినేని బాబురావు, డైరెక్టర్లు గుర్రం సురేశ్, ధరంసోత్ రాంసింగ్, రామంచ చంద్రయ్య, గడ్డం సుమలత, తూర్పునూరి రమేశ్, దుగ్యాల సుధాకర్‌రావు, పూజారి రాజేందర్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కంకణాల శ్రావణ్‌రెడ్డి, రిలీఫ్‌రెడ్డి, ఇన్‌చార్జి సీఈవో పుట్ట సురేశ్, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

CHANGE OF NAME
★ I, PAPANI ANUSHA (New Name), previously called POGU PADMAVATHI (Old Name), and R/o H.No. 7-84, Athmakur Vill and Mdl, Hanumakonda Dist-506342. T.G., India and solemnly declare.
NTW-326339

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

తాడ్వాయి ఏజెన్సీలో నల్గొండ రెడ్ల రాజ్యం

తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్

తాడ్వాయి, సెప్టెంబర్ 27 : తాడ్వాయి ఏజెన్సీలో నల్గొండ రెడ్ల రాజ్యం నడుస్తుందని, వారి ఆగడాలకు మద్దతుగా నిలుస్తున్న అధికారులు, నేతలు ఎవరో తేల్చాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులపై దాడులు చేసిన రెడ్డి కులస్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతోపాటు హత్యాయత్నం కేసులు నమోదు చేయకుంటే ఆదివాసీలమైన మా అస్తిత్వం కోసం ప్రత్యక్షదాడులు తప్పవని హెచ్చరించారు. గున్ను రెడ్డి అలియాస్ సూరజ్ అనే రౌడీని పెంచి పోషిస్తున్న, రక్షిస్తున్న మరో రెడ్డి ఎవరో తేలాల్సి ఉందని అన్నారు. గతంలో ఇద్దరు ఆదివాసీ యువకులను రాడ్లతో కొట్టిన కేసులో కూడా పోలీసులు సూరజ్‌ను అరెస్టు చేయలేదని అన్నారు. ఐదు ఎకరాల రెవెన్యూ భూమిలో అక్రమంగా తాడ్వాయి మండల కేంద్ర ఏజెన్సీలో భూమిని ఆక్రమించి ఫామ్ హౌస్ కట్టిన కూడా సంబంధిత అధికారులు, తహసీల్దార్ ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. నేడు ఆదివాసీ ఫారెస్టు బీట్ ఆఫీసర్ అయిన సోలం శరత్‌ను రాడ్లతో దాడి చేసినా ఎందుకు అరెస్టు చేయలేదని అన్నారు. ఐటీడీఏ పీవో, కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని తగిన చర్యలు చేపట్టి ఆదివాసీలకు అండగా ఉండాలని అన్నారు.

ఈ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ సంఘాలతో చర్చించి త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

గౌడలకు కాటమయ్య రక్షక కవచం

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 27 : కాటమయ్య రక్షక కవచం గీత కార్మికులను ప్రమాదాల బారిన పడకుండా కాపాడుతాయని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శైలజ అన్నారు. శుక్రవారం సోలిపేట గ్రామంలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సై షేక్ రబ్బాని, సిబ్బంది, గీత కార్మికులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంస్కృతీసంప్రదాయాలపై డాక్యుమెంటరీ

డాక్యుమెంటరీ రూపొందించడంపై పూజారులతో చర్చిస్తున్న ప్రభాకర్

తాడ్వాయి, సెప్టెంబర్ 27 : ఆదివాసీల సంస్కృతీసంప్రదాయాలు, వారి జీవన విధానాలపై పుస్తక రచనతోపాటు డాక్యుమెంటరీ రూపొందించనున్నట్లు పెసా కో-ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ తెలిపారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు డాక్యుమెంటరీ నిర్మించేందుకు శుక్రవారం మేడారంలోని ఆదివాసీ మ్యూజియంలో సమ్మక్క, సారలమ్మల పూజారులు, ఆదివాసీ యువకులు, మ్యూజియం అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవితో ఆయన చర్చించారు.

అమ్మవార్ల దన్శనానికి వచ్చే భక్తులకు ఆదివాసీల ఆచార వ్యవహారాలు తెలిసేలా పుస్తక రచనతోపాటు డాక్యుమెంటరీని రూపొందిస్తామని తెలిపారు. ఈ రచనలో ఆదివాసీలు జరుపుకునే పండగలు, పూజారులు సంవత్సరం పొడవునా అమ్మవార్లకు నిర్వహించే పూజలు తదితర వివరాలను సేకరించి డాక్యుమెంటరీని రూపొందిస్తామని వివరించారు.

మా తోటల సందర్శన

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 27 : మండలంలోని రాచపల్లి, పాత్రాపురం, టేకులబోరు, అబ్బాయిగూడెం, ముత్తారం, కొండాపురం, ఎదిర గ్రామాల్లో నాబార్డు సహకారంతో వన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మా తోటలను శుక్రవారం వరంగల్ క్లస్టర్ నాబార్డు అధికారి తుంగ రవి సందర్శించారు. ఈ మేరకు ఆయన రైతులకు యాజమాన్య పద్ధతులు వివరించి పంటలపై అవగాహన కల్పించారు. మా తోటల ద్వారా రైతులకు 56మామిడి, 22జామ, 70టేకు మొక్కలను ప్లాంటేషన్‌గా ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 111గ్రామాల్లో 450మంది గిరిజన రైతులకు పండ్ల తోటల పెంపకం, 50మంది నిరుపేద కుటుంబాలకు మేకలు, గొర్రెలు, పాడి పశువులు, టైలరింగ్, లేడీస్ ఎంపోరియం, కిరాణాషాపు, మినీ రైస్ మిల్లు ఎంపిక చేసి ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ ఆశయాలు కొనసాగించాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, సెప్టెంబర్ 27 : స్వ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల కోసం పోరాటం చేసిన మహావ్యక్తి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ అని, ఆయన ఆశయాలను భవిష్యత్ తరాల వారు కొనసాగించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ 109వ జయంతి కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ భవనంలో నిర్వహించగా కలెక్టర్ పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అనేక పోరాటాలు చేసి తెలంగాణ ఏర్పాటు కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ అని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి సీహెచ్ రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డీడీ తుల రవి, పద్మశాలి కుల సంఘం నాయకులు జనార్దన్, శ్రీధర్, రాజమల్లు, సారయ్య, జిల్లా సాధన సమితి అధ్యక్షుడు భిక్షపతిగౌడ్, అధికారులు పాల్గొన్నారు.


కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, పద్మశాలి సంఘం నాయకులు, వేడుకల్లో డీఎస్పీ, సీఐ

ఘనంగా లక్ష్మణ్ బాపూజీ జయంతి

కాటారం/ మల్హర్, సెప్టెంబర్ 27: తెలంగాణ ఉద్యమ దార్శనికుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు కాటారం మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలి, మల్హర్ మండలం తాడిచర్ల జూనియర్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాటారంలో పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మణ్ విగ్రహానికి పలువురు అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, పద్మశాలి సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పండ్లు, పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఎంపీటీసీలు రవీందర్‌రావు, జాడి మహేశ్వరి, బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ నేతలు చీమల రాజు, గడ్డం కొమురయ్య, ఆత్మకూరి కుమార్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దోమల సమ్మయ్య, నాయకులు సుజాత, రాజేందర్, అశోక్, బలరాం, గట్టయ్య, రమేశ్, వెంకటేశ్వర్లు, రాజనారాయణ, కుమారస్వామి, రాజశేఖర్, సత్యనారాయణ, సంతోష్, ఎలగం రవి, రాజయ్య, శ్రీనివాస్, సమ్మయ్య, సంతోష్ పాల్గొన్నారు. తాడిచర్ల కళాశాలలో ప్రిన్సిపాల్ విజయాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, అధ్యాపకులు నరేందర్, ప్రవీణ్, కరుణాకర్, స్వరూపారాణి, నరేశ్, జయపాల్, రవి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

రేగొండ, సెప్టెంబర్ 27 : పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలు, పారిశుధ్య పనులు, మంచి నీటి సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలన్నారు.